నమస్తే తెలంగాణ
# కరీంనగర్
5 | కరీంనగర్, సోమవారం 28 అక్టోబర్ 2024 | KARIMNAGAR

## ముత్తారం కస్తూర్బాలో 60 మందికి అస్వస్థత

- ఫుడ్ పాయిజన్ లేదా.. ఇటీవల కొట్టిన గడ్డి మందు ప్రభావంతోనే జరిగినట్లు అనుమానాలు
- పెద్దపల్లి దవాఖానకు తరలింపు
- ఆందోళనలో తల్లిదండ్రులు

పెద్దపల్లి/ ముత్తారం, అక్టోబర్ 27: ముత్తారం కస్తూర్బా బాలికల పాఠశాలలో దాదాపు 60 మంది విద్యార్థినులు అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న అధికారులు వారిని పెద్దపల్లి ప్రభుత్వ దవాఖానకు తరలించి చికిత్స అందిస్తున్నారు. తల్లిదండ్రులు పాఠశాల వద్దకు చేరుకొని ఆందోళన చెందుతున్నారు. అయితే, అస్వస్థతకు గల కారణాలను ఇంకా గుర్తించలేదు. ఫుడ్ పాయిజన్ జరిగిందా? లేక ఇటీవల పాఠశాల పరిధిలో కొట్టిన గడ్డి మందు ప్రభావం వల్ల ఈ పరిణామం చోటు చేసుకుందా.. అనే కోణంలో అధికారులు ఆరా తీస్తున్నారు. ప్రధానంగా ఇటీవల పాఠశాల పరిధిలో గడ్డి మందు కొట్టించినట్లుగా విద్యార్థినులు చెప్పారు. అదే గడ్డిని ఆదివారం విద్యార్థినులతో తొలగించారని, దాని ప్రభావం పిల్లలపై పడి ఉంటుందని తల్లిదండ్రులు అనుమానిస్తుండగా, ఇవి గాక మరే ఇతర కారణాలు ఏమైనా ఉన్నాయా? అన్నది తేలాల్సి ఉంది. ముందుగా నలుగురు విద్యార్థినులు పొడి దగ్గు బారిన పడగా.. ఆ తర్వాత దాదాపు 60 మందికి విస్తరించింది. పరిస్థితి ఆందోళనకరంగా మారడంతో విషయం తల్లిదండ్రుల వరకు చేరింది. వారు వెంటనే స్కూల్‌కు చేరుకొని పిల్లల ఆరోగ్యంపై ఆందోళన చెందగా, స్కూల్ యంత్రాంగం స్పందించింది. విద్యార్థినులను చికిత్స కోసం పెద్దపల్లి దవాఖానకు పంపిస్తూ వైద్యం అందేలా చూస్తున్నారు.



పిల్లలను పెద్దపల్లి దవాఖానకు తరలిస్తున్న అధికారులు

### ఎలాంటి ప్రమాదం లేదు..

విద్యార్థినులు అస్వస్థత చెందారనే సమాచారం అందగానే ముందస్తుగా అన్ని ఏర్పాట్లు చేశాం. నలుగురు పిల్లల వైద్య నిపుణులు, ఇతర వైద్యులు, వైద్య సిబ్బందిని సిద్ధంగా ఉంచాం. 44 మంది అడ్మిట్ ఆయ్యారు. వారందరికీ చికిత్స అందిస్తున్నాం. అందరి ఆరోగ్యం నిలకడగానే ఉంది. ఎలాంటి ప్రమాదం లేదు.

**- డా. శ్రీధర్, డీసీహెచ్‌ఎస్, పెద్దపల్లి.**

# నలుదిక్కులా అర్బన్ అథారిటీలే?



శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) మ్యాప్
రామగుండం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ మ్యాప్

## ఉమ్మడి జిల్లాలో నాలుగు ఏర్పాటు?

- ఇప్పటికే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో పూర్తి
- ఇదే బాటలో జగిత్యాల జిల్లా
- త్వరలోనే ఉత్తర్వులు వెలువడే అవకాశం
- ఆదాయం సమకూర్చుకునేందుకు సర్కారు కొత్త ఎత్తుగడ
- అథారిటీలతో పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకం?
- పల్లెప్రజలకు భారం కానున్న అథారిటీలు

**ప్రభుత్వం తన ఆదాయాన్ని పెంచుకునేందుకు కొత్త ఎత్తుగడలకు పోతున్నది. ఇందులో భాగంగానే ఉమ్మడి జిల్లాలో నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేయాలని నిర్ణయం తీసుకుంది. ఇప్పటికే కరీంనగర్, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి జిల్లాల్లో అర్బన్ అథారిటీలు ఏర్పాటు చేస్తూ ప్రత్యేక జీవోలు విడుదల చేయగా.. త్వరలోనే జగిత్యాల జిల్లాలో కూడా అథారిటీ ఏర్పాటు కానున్నది. ఆయా జిల్లాలను మొత్తంగా అథారిటీల పరిధిలోకి తీసుకవస్తుండగా, అభివృద్ధి కోసమే ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లుగా ప్రభుత్వం చెప్తున్నది. లోతుగా చూస్తే ఈ విధానం వల్ల పంచాయతీల మనుగడే ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పల్లెల ఆదాయం అథారిటీలకు వెళ్లడం వల్ల.. పంచాయతీలు ఆర్థికంగా చితికిపోయి.. నిర్వీర్యం అవుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది.**

కరీంనగర్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ ప్రతినిధి/ కార్పొరేషన్) : ఉమ్మడి జిల్లాలో నాలుగు అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలు ఏర్పాటు కాబోతున్నాయి. ఇప్పటికే రాష్ట్ర ప్రభుత్వం ఈ విషయంలో నిర్ణయం తీసుకోగా.. ఇప్పటికే రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి జిల్లాలకు సంబంధించి ప్రత్యేకంగా జీవోలు జారీ చేసిన విషయం తెలిసిందే. కరీంనగర్ శాతవాహన అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (సుడా) పరిధిని కొత్తగా 147 రెవెన్యూ గ్రామాలకు విస్తరిస్తూ ప్రభుత్వం జీవో నంబర్ 188 జారీ చేసింది. ఇప్పటి వరకు కరీంనగర్ కార్పొరేషన్‌తోపాటు కొత్తపల్లి మున్సిపాలిటీలు సుడా పరిధిలో ఉండగా.. ఇప్పుడు కొత్తగా హుజూరాబాద్, జమ్మికుంట, చొప్పదండి మున్సిపాలిటీలు దీని పరిధిలోకి వస్తాయి. వీటితోపాటు 147 గ్రామాలను సుడా పరిధిలోకి తెస్తూ జీవోను విడుదల చేసింది. అలాగే, వేములవాడ ఆలయ అభివృద్ధి కోసం ఏర్పాటు చేసిన వేములవాడ ఆలయ ఏరియా అభివృద్ధి ప్రాధికార సంస్థ (వీటీడీఏ)పరిధిని రాజన్న సిరిసిల్ల మొత్తానికి వర్తింపజేస్తూ.. జీవో నంబర్ 184ను విడుదల చేసిన విషయం తెలిసిందే. వేములవాడ అర్బన్ మండలంలోని 11 గ్రామాలతోపాటు.. వేములవాడ పురపాలక సంఘం మాత్రమే గతంలో దీని పరిధిలో ఉండేది. కొత్తగా సిరిసిల్ల మున్సిపాలిటీతోపాటు వేములవాడరూరల్, బోయినపల్లి, ఇల్లంతకుంట, ఎల్లారెడ్డిపేట, వీర్నపల్లి, ముస్తాబాద్, గంభీరావుపేట, చందుర్తి, రుద్రంగి, కోనరావుపేట మండలాల్లోని 152 రెవెన్యూ గ్రామాలను దీని పరిధిలోకి తీసుకొచ్చారు. అలాగే, పెద్దపల్లి జిల్లాలో రామగుండం అర్బన్ డెవలప్ మెంట్ అథారిటీ(రుడా)ని ఏర్పాటు చేస్తూ జీవో నెంబర్ 165ను జారీ చేసింది. జిల్లాలోని రామగుండం నియోజకవర్గాన్ని పూర్తిగా పెద్దపల్లి, మంథని, ధర్మపురి నియోజకవర్గాల్లోని కొంత భాగాన్ని దీని పరిధిలోకి చేర్చింది. రామగుండం కార్పొరేషన్, పెద్దపల్లి, సుల్తానాబాద్, మంథని మున్సిపాలిటీలతో పాటు ధర్మారం, పాలకుర్తి, అంతర్గాం, పెద్దపల్లి, జూలపల్లి, ఎలిగేడు, సుల్తానాబాద్, ఓదెల, కాల్వశ్రీరాంపూర్, మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం మండలాల్లోని 198 గ్రామాలను రుడా పరిధిలోకి తీసుకొచ్చారు. ఇదిలా ఉంటే.. జగిత్యాల జిల్లాకు సంబంధించిన ప్రతిపాదనలు సైతం ఇప్పటికే ప్రభుత్వం ముందున్నాయి. జిల్లా బేస్‌డ్‌గా, ఒక అథారిటీగా ఏర్పాటు చేస్తూ త్వరలోనే ఉత్తర్వులు జారీ కానున్నాయి. వీటికి సంబంధించిన అన్ని పనులూ ప్రభుత్వం వద్ద పూర్తయ్యాయని తెలుస్తుండగా.. అతి త్వరలోనే ఈ ఉత్తర్వులు వెలువడుతాయని ఓ ఉన్నతాధికారి 'నమస్తే'కు తెలిపారు. అంటే.. ఆ జిల్లా ఆధారంగా అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీలను ఏర్పాటు చేస్తున్నట్లుగా స్పష్టమవుతోంది.

### పంచాయతీల ఆదాయానికి గండి

ఇప్పటికే ఆర్థిక లేమితో కొట్టుమిట్టాడుతున్న పంచాయతీలకు అథారిటీలు కొత్త కష్టాలను తెచ్చిపెడుతాయని నిపుణులు పేర్కొంటున్నారు. గ్రామ పంచాయతీల్లో భవన నిర్మాణ అనుమతుల నుంచి వచ్చే బెటర్‌మెంట్, డెవలప్‌మెంట్ ఫీజులు ఇప్పటి వరకు పంచాయతీల ఖాతాల్లోనే జమవుతున్నాయి. కాగా, అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చిన తర్వాత మాత్రం డెవలప్‌మెంట్ ఫీజులన్నీ అథారిటీ అకౌంట్‌కు చేరుతాయి. దీని వల్ల పంచాయతీలకు ఆదాయం పూర్తిగా తగ్గిపోతుంది. అప్పుడు పంచాయతీలు కేవలం ఆస్తి పన్నులు, చెత్త సేకరణ యూజర్ చార్జీల మీదే ఆధార పడాల్సిన పరిస్థితి వస్తుంది. దీంతోపాటు అథారిటీలు రూపొందించే మాస్టర్ ప్లాన్ విషయంలోనూ ఎక్కువగా మండలాలను పరిగణలోకి తీసుకుంటారు. దీంతో రెసిడెన్షియల్, కమర్షియల్, ఇండస్ట్రియల్, మిక్స్‌డ్ జోన్లుగా ప్రాంతాలు విభజన చేయాల్సి ఉంటుంది. ఫలితంగా ఎవరి ఇష్టానుసారం వాళ్లు నిర్మాణాలు చేసుకోవడానికి ఆస్కారం ఉండదు. పంచాయతీలు అనుమతులు ఇవ్వడానికి అథారిటీ చట్టాలు ఒప్పుకోవు. దీని వల్ల సమస్యలు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. అలాగే, పంచాయతీల్లో వివిధ నిర్మాణ అనుమతుల ద్వారా వచ్చే ఆదాయాలను అథారిటీలు అదే పంచాయతీల్లో వెచ్చించే అవకాశాలు చాలా తక్కువగా ఉంటాయి. ఈ రంగంలోని నిపుణులు చెపుతున్న దాని ప్రకారం చూస్తే.. అర్బన్ అథారిటీ అమల్లోకి వచ్చిన తర్వాత ఏ పంచాయతీలైనా సరే.. 300 చదరపు మీటర్లకు మించి విస్తీర్ణంలో నిర్మాణం చేయాలంటే ఆయా అర్బన్ అథారిటీల నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. అలాగే, జీ ప్లస్ 3 దాటే నిర్మాణాల అనుమతుల కోసం అర్బన్ అథారిటీకి వెళ్లాల్సిందే. అలాగే, అర్బన్ అథారిటీ పరిధిలోకి వచ్చే ఏ పంచాయతీలో అయినా వాణిజ్య నిర్మాణాలు చేపడితే తప్పనిసరిగా అథారిటీకి వెళ్లాల్సిందే. అది ఏ చిన్న వాణిజ్య నిర్మాణమైనా.. ఉదాహరణకు చూస్తే.. కోళ్ల షెడ్స్ వంటి ఇతర ఎలాంటివైనా అథారిటీ నుంచి అనుమతులు తీసుకోవాల్సి ఉంటుంది. దీనికి ఆయా అథారిటీల్లో నిర్ణయించిన మేరకు ఫీజులు కూడా భారీగానే ఉండే అవకాశం ఉంది. అలాగే, ఇంటి పన్నులు భారీగా పెరగనున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం అన్ని జిల్లాల్లోని పంచాయతీల్లో మాస్టర్ ప్లాన్ అమలు చేయడం కోసం జిల్లా టౌన్ కంట్రీ, ప్లానింగ్ ఆఫీసర్ (డీటీసీపీ) ఉన్నారు. ప్రస్తుతం జిల్లా మొత్తాన్ని అర్బన్ అథారిటీ పరిధిలోకి తీసుకుంటున్న పరిస్థితుల నేపథ్యంలో ఈ విభాగం పరిస్థితి ఏమిటన్న ప్రశ్నలు తెరపైకి వస్తున్నాయి.

### పంచాయతీల భవిష్యత్ ప్రశ్నార్థకం

అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీల పేరుతో తీసుకుంటున్న ఈ నిర్ణయం వెనుక ప్రభుత్వం ఆదాయం పెంచుకోవాలన్న ఎత్తుగడ కనిపిస్తున్నా.. పంచాయతీల మనుగడ ప్రశ్నార్థకంగా మారే ప్రమాదం ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఈ రంగంలోని వివిధ నిపుణుల ద్వారా సేకరించిన సమాచారం చూస్తే.. అథారిటీలు అమల్లోకి వస్తే పంచాయతీలు ఆర్థికంగా పూర్తిగా చితికిపోయే ప్రమాదం ఉందని పేర్కొంటున్నారు. ప్రస్తుతం పంచాయతీలకు వివిధ రూపేణా వస్తున్న పన్నులు, ఇతర ఆదాయాల్లో ఇక నుంచి మెజార్టీ శాతం అర్బన్ అథారిటీలకు సమకూరనున్నాయి. అంతేకాదు.. పల్లె ప్రజలు పంచాయతీలను విడిచి తమ పనులకోసం అథారిటీల వెంట తిరగాల్సి వస్తుందని తెలుస్తోంది. అథారిటీల ఏర్పాటు, దాని వెనుక దాగి ఉన్న అంశాలను లోతుగా విశ్లేషించి చూస్తే. పంచాయతీల మనుగడకు ఇబ్బంది తప్పదని తెలుస్తోంది. అర్బన్ అథారిటీల విస్తరణతో గ్రామ పంచాయతీల ఆదాయాలకు కోతలు పడనున్నాయి. వీటితోపాటు ఒక స్థాయి దాటిన భవన నిర్మాణ అనుమతుల కోసం, వాణిజ్య అవసర నిర్మాణ అనుమతుల కోసం ఇక ముందు అర్బన్ అథారిటీల వద్దకు వెళ్లాల్సి ఉంటుందని నిపుణులు చెప్తున్నారు. దీని వల్ల ఆయా గ్రామ పంచాయతీల పరిధిల్లో ఉన్న ప్రజలకు ఇబ్బందులు వచ్చే ప్రమాదాలు ఉన్నాయి. ప్రస్తుతం పంచాయతీ పరిధిలో గృహ నిర్మాణాలు, వాణిజ్య నిర్మాణాలు ఏవి చేసినా పంచాయతీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకొని అక్కడి నుంచే అనుమతులు తీసుకుంటున్నారు. ఆయా ప్రాంతాల్లో స్థానికంగా ఉండే అవసరాలకు అనుగుణంగా, పంచాయతీ రూపొందించిన ప్లాన్ ప్రకారం రోడ్ల విస్తీర్ణం వాటిని పరిగణనలోకి తీసుకొని నిర్మాణ అనుమతులు ఇస్తున్నారు. కాగా, అర్బన్ అథారిటీ పరిధిలోకి వస్తే.. 30 ఫీట్లకు తక్కువగా రోడ్డు ఉండే అనుమతులు దొరకడం కష్టమే. అలాగే, అర్బన్ అథారిటీ మాస్టర్ ప్లాన్ ప్రకారమే నిర్మాణాలు చేసుకోవాల్సిన పరిస్థితి వస్తుంది. ఇది పూర్తిగా స్థానికంగా ఉండే ప్రజలకు ఇబ్బందులు తీసుకువచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది.

## కమాండెంట్ మాకొద్దు

- మాతో వెట్టి చాకిరి చేయిస్తున్నడు
- ఇటీవల కౌన్సెలింగ్ పేరిట తమ కుటుంబ సభ్యులతో అసభ్యకరంగా మాట్లాడిండు
- సర్దాపూర్‌లో బెటాలియన్ పోలీసుల ఆందోళన
- ఆరుగురి సస్పెన్షన్ ఎత్తివేయాలని డిమాండ్


కమాండెంట్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న 17వ బెటాలియన్ పోలీసులు

రాజన్న సిరిసిల్ల, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ): సిరిసిల్ల సర్దాపూర్‌లోని 17వ బెటాలియన్ పోలీసులు మళ్లీ ఆందోళనకు దిగారు. ఏక్ పోలీస్ విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేస్తూ రెండ్రోజుల కింద ఆందోళన చేసిన పోలీసులలో ఆరుగురిని సస్పెండ్ చేయడాన్ని నిరసిస్తూ ఆదివారం రోడ్డెక్కారు. వంద మందికిపైగా పోలీసు సిబ్బంది బెటాలియన్ ఆవరణలోని కమాండెంట్ కార్యాలయాన్ని ముట్టడించారు. రోడ్డుపై బైఠాయించి ఆందోళన చేశారు. వెట్టి చాకిరి చేయిస్తున్న కమాండెంట్ మాకొద్దని, ఆయన పాలనకు చరమగీతం పాడాలని, తమకు న్యాయం చేయాలని నినదించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే రాష్ట్రం, ఒకే పోలీస్ విధానం కోసం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా సిరిసిల్ల బెటాలియన్‌లోనే తాము ఆందోళన చేశామన్నారు. బయటకు రాకుండా తమ పరిధిలోనే ఆందోళన చేశామని, మీడియా ముందు తమ బాధలు చెప్పుకున్న పాపానికి తమ సహోద్యోగులైన ఆరుగురిని సస్పెండ్ చేశారన్నారు. తమ బాధలు చెప్పుకోవడం నేరమా అంటూ ప్రశ్నించారు. సస్పెన్షన్ ఎత్తివేయాలని, లేదా మా అందరినీ సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. కమాండెంట్ బయటకు వచ్చి తమకు సమాధానం చెప్పాలని పట్టుబట్టారు. గంటపాటు నిరసన, ఆందోళన చేసినా కమాండెంట్ బయటకు రాలేదు. వీరు ఆందోళన చేస్తున్న విషయం తెలుసుకున్న డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ కృష్ణ ఘటనా స్థలానికి చేరుకున్నారు. వారిని సైతం బెటాలియన్‌లోకి అనుమతించలేదు. ఆరుగురు ఉద్యోగులపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేసే వరకు ఆందోళన కొనసాగిస్తామన్నారు. కాగా, రెండ్రోజుల కింద తమ భార్య, పిల్లలు కుటుంబాలతో వచ్చి సిరిసిల్ల పట్టణంలో ఆందోళన చేశారని, వారందరినీ కౌన్సెలింగ్ పేరిట బెటాలియన్‌లోకి తీసుకొచ్చి కమాండెంట్ అసభ్యకరంగా మాట్లాడారని ఆరోపించారు. 'మీ భర్తల డ్యూటీలు ఇలాగే ఉంటాయని తెలువదా? మీరెందుకు పోలీసులను పెళ్లి చేసుకున్నారంటూ' అన్నారని, కమాండెంట్ మాట్లాడే పద్ధతి ఇదేనా? అంటూ ఆవేదన వ్యక్తం చేశారు.

### పోలీసుల కొవ్వొత్తుల ప్రదర్శన

పోలీసుల సస్పెండ్‌ను ఎత్తివేయాలని కోరుతూ 17వ బెటాలియన్ పోలీసులు ఆదివారం రాత్రి సిరిసిల్లలో కొవ్వొత్తులతో తెలంగాణ తల్లి విగ్రహం నుంచి గాంధీ చౌరస్తా వరకు ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తాము చేస్తున్న న్యాయమైన విజ్ఞప్తుల వెనుక ఏరాజకీయ పార్టీతో సంబంధం లేదన్నారు. ప్రభుత్వానికి వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన ఆందోళనలో భాగంగా 39 మందిని సస్పెండ్ చేశారని, వారందరినీ తిరిగి విధుల్లో చేర్చుకోవాలని డిమాండ్ చేశారు. సిరిసిల్ల బెటాలియన్ పరిధిలో ఆరుగురిని సస్పెండ్ చేసినట్లు తెలిపారు.

### మాకొద్దీ కమాండెంట్..

తాము పోలీసులమే కానీ కూలీలకన్నా అధ్వానంగా తమతో కమాండెంట్ వెట్టిచాకిరి చేయిస్తున్నాడంటూ ఆవేదన వ్యక్తం చేశారు. తమ వాహనాలలో రాత్రి వేళలో మానేరు నుంచి ఇసుక రవాణా చేయిస్తున్నారని, బయట మిషన్ భగీరథ పైపులు మోయిస్తున్నాడని ఆరోపించారు. కూలీల కన్నా అధ్వానంగా తమతోనే కందకాలు తవ్వించడం, రోడ్లు వేయించడం లాంటి పనులు చేయిస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకెక్కడన్నా ఉద్యోగం చేస్తాం కానీ, ఈ కమాండెంట్ వద్ద పనిచేయలేమంటూ స్పష్టం చేశారు. పోలీసు సిబ్బంది చేసిన ఆరోపణలపై కమాండెంట్‌ను వివరణ కోరేందుకు వెళ్లిన విలేకరులను కూడా బెటాలియన్ పోలీసులు అనుమతించ లేదు.

## పొలిటికల్ డ్రామా చేస్తున్న సీఎం

మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ధ్వజం



చొప్పదండి, అక్టోబర్ 27 : బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్‌ను ఎదుర్కొనే దమ్ము లేక సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ డ్రామాలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో మండిపడ్డారు. కేటీఆర్ సంబంధీకుల శుభకార్యంలో పాల్గొంటే దానిని కూడా కాంగ్రెస్ నాయకులు తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా ప్రజలను మభ్యపెడుతూ పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. కేటీఆర్‌పై కొండా సురేఖ చేసిన ఆరోపణలు అవాస్తమని తెలిపారు. హైడ్రాతో హైదరాబాద్ ప్రజలను ఇబ్బందులు పెడుతున్నారని మండిపడ్డారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ గద్దెనెక్కిందని, ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేశారు. కేటీఆర్‌పై తప్పుడు ఆరోపణలు చేస్తే దేనికైనా సిద్ధంగా ఉంటామని హెచ్చరించారు.

## జాతీయ యోగాలో దీపక్ సత్తా

- రాష్ట్ర యోగా చరిత్రలో తొలిసారి బంగారు పతకం
- తెలంగాణ తరపున పాల్గొని ప్రతిభచాటిన పెద్దపల్లి జిల్లా విద్యార్థి



జాతీయ యోగా పోటీల్లో బంగారు పతకం అందుకుంటున్న దీపక్

కొత్తపల్లి/ మానకొండూర్/ మానకొండూర్ రూరల్, అక్టోబర్ 27: జాతీయస్థాయి యోగా పోటీల్లో తెలంగాణకు తొలిసారిగా స్వర్ణ పతకం లభించింది. హిమాచల్ ప్రదేశ్‌లోని ఉనాలో ఈ నెల 24 నుంచి 27 వరకు జరిగిన పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో రాష్ట్ర జట్టు తరపున పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం నారాయణరావుపల్లికి చెందిన పీ దీపక్ సత్తా చూపాడు. అద్భుత ప్రతిభ చాటి తొలిసారిగా గోల్డ్ మెడల్ సాధించాడు. నారాయణరావుపల్లికి చెందిన సాయికుమార్, సింధూర కొడుకే పీ దీపక్. తాత నానమ్మలు పురాణం రాజు, లక్ష్మిల ప్రోత్సాహంతో యోగాలో శిక్షణ పొందాడు. ప్రస్తుతం కరీంనగర్ జిల్లా మానకొండూర్ సాంఘిక సంక్షేమశాఖ గురుకుల పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న విద్యార్థి, సబ్ జూనియర్ విభాగంలో పసిడి పతకం పొంది రికార్డ్ సృష్టించాడు. ఈ సందర్భంగా దీపక్‌తో పాటు ఆయన కోచ్ రామకృష్ణను తెలంగాణ యోగా అసోసియేషన్ చైర్మన్ సర్దార్ రవీందర్ సింగ్ , ప్రధాన కార్యదర్శి ఎన్ సిద్ధారెడ్డి, డీవైఎస్‌వో శ్రీనివాస్‌గౌడ్, రాష్ట్ర యోగా అసోసియేషన్ పూర్వ ప్రధాన కార్యదర్శి మనోహర్, యోగా కోచ్‌లు కిష్టయ్య, కోటేశ్వరరావు, మల్లికా, ప్రదీప్ కుమార్, ఉమ్మడి జిల్లా యోగా అసోసియేషన్ కార్యదర్శులు విజయ్‌కుమార్ (పెద్దపల్లి), మనోజ్ కుమార్ (జగిత్యాల), ఉప్పాల శ్రీనివాస్ (సిరిసిల్ల) అభినందించారు.

# పత్తి ఇప్పుడే కొనం!



- తేమను సాకుగా చూపుతున్న సీసీఐ
- రెండోసారి ఏరిన తర్వాతే కొనుగోళ్లు
- తెగేసి చెబుతున్న అధికారులు
- ఇప్పటి వరకు కొన్నది 60 క్వింటాళ్లు మాత్రమే..
- అగ్గువకు అమ్ముకుంటున్న రైతులు
- తేమ శాతం చూపి ధర తగ్గిస్తున్న ట్రేడర్లు

**ఇప్పుడే పత్తి కొనుగోళ్లు జరిపే పరిస్థితి లేదని కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) అధికారులు తేల్చి చెబుతున్నారు. మొదటి పికింగ్‌లో పత్తి తమ నిబంధనల ప్రకారం ఉండడం లేదని చెబుతున్నారు. వారం కింద జమ్మికుంట మార్కెట్‌లో తెరిచిన సీసీఐ కేంద్రంలో కేవలం 60 క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. అయితే, రెండోసారి సేకరించే పత్తి మాత్రమే కాస్త సీసీఐ నిబంధనల మేరకు ఉంటుందని, అప్పుడే కొనుగోళ్లు ప్రారంభిస్తామని సీసీఐ అధికారులు స్పష్టం చేస్తున్నారు. దీంతో ట్రేడర్లు అడిగిన ధరకు రైతులు విక్రయించుకుంటుండగా, కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రైతులకు అందకుండా పోతోంది.**

కరీంనగర్, అక్టోబర్ 27 (నమస్తే తెలంగాణ) : ఆరు గాలం శ్రమించి పండించిన పత్తిని విక్రయించుకునేందుకు రైతులు మునుపెన్నడూ లేని విధంగా కష్టాలు ఎదుర్కోవాల్సి వస్తోంది. పేరుకే సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేయగా కొనుగోళ్లలో ట్రేడర్ల హవానే కనిపిస్తోంది. తేమ సాకుతో సీసీఐ కొనుగోళ్లు చేయకపోవడంతో రైతులు ట్రేడర్లు, ఇతర వ్యాపారులకు అడ్డగోలు ధరకు విక్రయిస్తున్నారు. కరీంనగర్ జిల్లాలో గత రెండు మూడేళ్లలో క్రమంగా పత్తి సాగు తగ్గుతోంది. ఈ ఏడాది 42,730 ఎకరాల్లో పత్తి చేయగా అకాల వర్షాలతో దిగుబడులు దెబ్బతిన్నాయి. ఎకరాకు కనీసం 9 క్వింటాళ్ల పత్తి దిగుబడి రావాల్సిన చోట 6-7 క్వింటాళ్ల వరకే వస్తోందని ఒక పక్క రైతులు వాపోతున్నారు. వచ్చిన దిగుబడికైనా ఆశించిన రీతిలో ధర ఉంటుందా? అంటే సీసీఐ పుణ్యమా అని అధికూడా దక్కడం లేదు. 38,450 మెట్రిక్ టన్నుల దిగుబడి వస్తుందని అంచనా వేయగా జిల్లా వ్యాప్తంగా 9 జి న్నింగ్ మిల్లులు, జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో సీసీఐ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసింది. కానీ, ఇప్పటి వరకు ఒక్క జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లోని కేంద్రాన్ని మా త్రమే వారం కింద ప్రారంభించింది. కేవలం ముగ్గురు రైతుల నుంచి 60 క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారంటే సీసీఐ ఏ స్థాయిలో పత్తి కొనుగోళ్లు జరుపుతున్నదో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో ట్రేడర్లు, చిన్న వ్యాపారులు, దళారులకు రైతులు అతి తక్కువ ధకు విక్రయించుకునే పరిస్థితి వచ్చింది. ఒక్క జమ్మికుంట మార్కెట్‌లోనే ఇప్పటి వరకు 3,500 క్వింటాళ్ల పత్తి విక్రయించగా కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.7,521 ఏ ఒక్క రైతుకూ దక్కలేదు. ట్రేడర్లు, ఇతర వ్యాపారులు రూ.6,300 నుంచి రూ.6,600 మించి ధర పెట్టడం లేదు. రోజుకు ఒకరిద్దరు రైతుల పత్తికి మాత్రమే రూ.7 వేలు చెల్లిం చి గరిష్ట ధర కింద చూపుతున్నారు. ఇంత దారుణమైన పరిస్థితిని తామెప్పుడూ ఎదుర్కోలేదని పత్తి రైతులు వాపోతున్నారు.

### రెండో పికింగ్ వరకు కొనుగోళ్లు

రైతులు తెచ్చిన పత్తిని ట్రేడర్లు కూడా అయిష్టంగానే కొంటున్నారని తెలుస్తోంది. పత్తిలో తేమ శాతం అధికంగా ఉండడం, రంగు మారడం, గింజ పొడవు రాకపోవడం వంటి కొన్ని కారణాలను చూపుతూ ధరను దారుణంగా తగ్గిస్తున్నారు. సీసీఐ నిబంధనల ప్రకారం చూస్తే తేమ 8 నుంచి 12 శాతం మాత్రమే ఉండాలి. కానీ, ప్రస్తుతం 30 నుంచి 40 వరకు ఉంటోందని, అందుకే సీసీఐ పూర్తి స్థాయిలో కొనుగోళ్లు ప్రారంభించడం లేదని మార్కెటింగ్ అధికారులు చెబుతున్నారు. నిజానికి ట్రేడర్లు కొనుగోలు చేస్తున్న కొందరు రైతులకు సంబంధించిన పత్తి నాణ్యతా ప్రమాణాల ప్రకారం ఉన్నా సీసీఐ కొనుగోళ్లు జరిపేందుకు ముందుకు రావడం లేదనే ఆరోపణలు విపిస్తున్నాయి. ప్రతి రోజూ మార్కెట్‌కు వచ్చే పత్తిలో రూ.6,600 నుంచి రూ.7 వేల ధర పలుకుతున్న పత్తిలో తేమ శాతం తక్కువే ఉంటోందని, సీసీఐ కొంటే తమకు కనీస మద్దతు ధర వచ్చేదని రైతులు వాపోతున్నారు. తమ అవసరాల కోసం, అప్పులు చెల్లించుకునేందుకు పత్తి విక్రయాలు ఎప్పటికప్పుడు చేయక తప్పడం లేదని చెబుతున్నారు. కానీ, ఎఫ్‌ఏక్యూ నిబంధనల ప్రకారం ఉన్న పత్తిని కూడా సీసీఐ కొనుగోలు చేసేందుకు ముందుకు రాకపోవడంతోనే తాము ఆవేదనకు చెందుతున్నామని స్పష్టం చేస్తున్నారు.

### అగ్గువ ధరకే విక్రయాలు

జమ్మికుంట లాంటి అతిపెద్ద వ్యవసాయ మార్కెట్ పరిధిలో 10 జిన్నింగ్ మిల్లులు, 16 మంది లైసెన్స్‌డ్ ట్రేడర్లు ఉన్నారు. మార్కెట్ పరిధిలో ప్రస్తుత సీజన్‌లో 1.60 లక్షల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. అయితే, ఇప్పుడు మార్కెట్‌కు వస్తున్న పత్తి నాసిరంగా ఉన్నదని కొందరు ట్రేడర్లు కూడా పత్తి కొనుగోళ్లను నిరాకరిస్తున్నారు. అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పత్తిని సీసీఐ ఎలాగూ కొనడం లేదు. ట్రేడర్లు సైతం ఇది పనికి రాని పత్తిగా నిర్ధారించి కొనేందుకు ముందుకు రావడం లేదు. ఈ నేపథ్యంలో మహారాష్ట్ర, తదితర రాష్ట్రాల నుంచి వచ్చిన పరుపుల వ్యాపారులు అడ్డగోలుగా ధరలు తగ్గించి కొనుగోళ్లు జరుపుతున్నారు. ఇలాంటి పత్తి క్వింటాలుకు కనీసం రూ.4 వేల నుంచి రూ.5 వేలకు మించి పోవడం లేదు. ఆదిలాబాద్, వరంగల్ మార్కెట్ల తర్వాత ఎక్కువగా జమ్మికుంట మార్కెట్‌కే ఉత్తర తెంగాణలో పత్తి విక్రయాలు జరుగుతాయి. ఈ నేపథ్యంలో పరుపుల వ్యాపారులు పెద్ద సంఖ్యలో వచ్చి కొనుగోళ్లు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఇప్పటి వరకు ట్రేడర్లు కొనుగోలు చేసిన దానికంటే ఇలాంటి వ్యాపారులు కొనుగోలు చేసిందే ఎక్కువగా ఉన్నట్లు స్పష్టమవుతోంది. పరిస్థితి ఇంత దారుణంగా ఉంటే సీసీఐ మాత్రం రెండో పికింగ్ తర్వాతనే తాము కొనుగోళ్లు జరుపుతామని భీష్మించుకుని కూర్చోవడం, రాష్ట్ర ప్రభుత్వం కనీసం సీసీఐ అధికారులతో చర్చించేందుకు చొరవ చూపకపోవడంతో రైతులు అడ్డగోలు ధరకు పత్తిని విక్రయించి తీవ్రంగా నష్టపోతున్నారు.